సాక్షి నిర్మల్

ఆదివారం । 10 । మార్చి । 2024



సూర్యపూర్‌లో కుస్తీపోటీలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుంటాల మండలం సూర్యపూర్ శ్రీరాజరాజేశ్వర ఆలయ ఆవరణలో అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు నిర్వహించారు. 8లో▸



మొక్కలకు చలువ పందిళ్లు!

నర్సరీల్లో మొక్కలపై చలువ పందిళ్లను (గ్రీన్ మ్యాట్స్) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం ఒక్కో నర్సరీకి రూ.3 వేల నిధులు కేటాయించింది. 9లో▸

గరిష్టం/కనిష్టం 37.5 /27.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అపుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కుగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కబోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పండుగలతో ఏకతాభావం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: పండుగలతో ఏకతాభావం పెంపొందుతుందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. శివరాత్రి వేడుకలు పురస్కరించుకుని పట్టణంలోని కిసాన్‌గల్లి మహాదేవ్ మందిర్, సిద్దార్థనగర్‌లోని ఓంకారేశ్వర, పాతాళేశ్వరాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఓంకారేశ్వరాలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం మహాకాల్ యూత్, ఏక్‌తా యూత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, అయోధ్య శ్రీరాముడి చిత్రపటం అందజేశారు. అలాగే గోసంరక్షణ కమిటీ సభ్యులు సైతం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్, సుభాష్‌పటేల్, మహిళామోర్చా అధ్యక్షురాలు సుష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అల్లోల'కు బోధన్ ఎమ్మెల్యే పరామర్శ



ఐకేరెడ్డిని పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోదరుడు హనుమంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి శనివారం ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారివెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అల్లోల సోదరుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు మారుగొండ రాము, పాకాల రాంచందర్, ధర్మాజీ రాజేందర్, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ధర్నా



బల్దియా ఎదుట మహిళల ఆందోళన..

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు తాగునీరు రావడం లేదని కాలనీవాసులు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. వీరికి సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి, డబుల్ బెడ్‌రూం అబివృద్ధి కమిటీ అధ్యక్షుడు నంది రామయ్య మద్దతుగా కార్యాలయం ఎదుట బైఠాయించారు. కాలనీలో తాగునీటితోపాటు ఇతర సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన ఇళ్లలో పైపులైన్ లీకేజీలు ఉన్నాయని తెలిపారు. కాలనీలో సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ చిన్న సత్యం ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ట్యాంకర్‌తో నీళ్ల సరఫరా చేస్తామని తెలిపారు. దీంతో ఆందోళన విరమించిన కాలనీవాసులు చైర్మన్‌తోపాటు కమిషనర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు.

వినూత్నంగా శివరాత్రి జాగరణ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ సైక్లింగ్ క్లబ్ సభ్యులు శివరాత్రి జాగరణను వినూత్నంగా పూర్తి చేశారు. సైకిల్‌పైనే రాత్రంతా యాత్ర చేస్తూ జాగరణ కొనసాగించారు.

- వివరాలు 10లో▸

అసాంఘికకాలలకు అడ్డా..!

- భక్తుల ముసుగులో లాడ్జీల్లో ఆశ్రయం
- పోలీసుల తనిఖీలు అంతంత మాత్రమే
- కొత్త ఎస్పీ రాకతో స్పందిస్తున్న తీరు
- తాజాగా దాడుల్లో పట్టుబడ్డ 'లాడ్జీలు'



గతేడాది జూలై 24న బాసర పోలీస్ స్టేషన్‌లో లాడ్జీ యజమానులతో సమావేశం(ఫైల్)



భైంసా: చదువుల తల్లి సరస్వతీ దేవి కొలువుదీరిన పుణ్యక్షేత్రం బాసర. ఇక్కడికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. స్థానికంగా ఉన్న ఆలయ వసతి గదులు సరిపోకపోవడంతో ఆలయం చుట్టూ ప్రైవేటు లాడ్జీలు వెలిశాయి. బాసరకు వచ్చే భక్తులకు గదులు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే కొంత మంది యజమానులు లాడ్జీలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తుండడంతో లాడ్జీ గదులను అద్దెకు ఇస్తున్నారు. ఈ కార్యకలాపాలతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

పోలీసుల దాడులు..

ఎస్పీ జానకీషర్మిల ఆదేశాలతో గత మంగళవారం ముథోల్ సీఐ మల్లేశ్ లాడ్జీలపై దాడులు చేశారు. ఈ తనిఖీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిని పట్టుకున్నారు. లాడ్జీ యజమానులపై, అసాంఘిక కార్యక్రమాలకుపాల్పడేవారిపై కేసులు నమోదు చేశారు. కొన్నేళ్లుగా అసాంఘిక కార్యకలాపాలకు ఆశ్రయం కల్పించే లాడ్జీ యజమానులు అదే పనిని కొనసాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు పోలీసుల తనిఖీలు జరిగితే అసాంఘిక కార్యక్రమాలకు తావు ఉండదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బాసర లాడ్జీలు సేఫ్ అనే విషయం తెలిసివస్తుంది. కొంత మంది యజమానులు సంపాదనకు అలవాటుపడి అదే పనిగా బాలురు, బాలికలకు గదులు ఇస్తున్నారు.

8 నెలలుగా సమావేశాలు లేవు..

గతేడాది జూలై 24న బాసర పుణ్యక్షేత్రంలో ఎస్సై గణేశ్ ఆధ్వర్యంలో ప్రైవేటు సత్రాల యజమానులు, లాడ్జీ యజమానులతో స మావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ప్రైవేటు సత్రాల్లో, లాడ్జీల్లో మైనర్లకు గదులు అద్దెకు ఇస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటా రని హెచ్చరించారు. ఆలయానికి వచ్చే కు టుంబాలకు మాత్రమే గదులు అద్దెకు ఇవ్వాలని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అ ద్దెకు తీసుకునే వారి వివరాలు తప్పనిసరిగా రి కార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఐడీ కార్డులు తీసుకుని పూర్తిగా విచారణ చేసి న తర్వాతనే గదులను కేటాయించాలని తెలి పారు. అయినా లాడ్జీల యజమానులు అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై బాసర లాడ్జీలపై నిఘా ఉంచి తనిఖీలు చేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

మహారాష్ట్ర నుంచి...

పోలీసులు గత మంగళవారం చేపట్టిన తనిఖీల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశమిస్తూ పలువురు లాడ్జీల్లో దొరికిపోయాయి. కొంతకాలంగా ఇలాంటివి కొనసాగుతాయని ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు పెద్ద మొత్తంలో బాసర లాడ్జీలను అడ్డాగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. మైనర్లకు ఇక్కడ గదులు అద్దెకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అద్దెకు తీసుకునేవారి వివరాలు సేకరించాల్సిన లాడ్జీల యజమానులు అవేవీ తీసుకోవడం లేదని తెలుస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రంలో ఇలాంటి కార్యక్రమాలు జరుగకుండా నిఘా ఉంచాల్సిన అధికారులే నిర్లక్ష్యం చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు.

కొన్ని లాడ్జీలతో అందరికీ మచ్చ..

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన కొన్ని లాడ్జీల యజమానుల నిర్వాకంతో బాసరలో అన్ని లాడ్జీలకు మచ్చ వస్తుందని మిగితా లాడ్జీల ఓనర్లు పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలతో బాసర క్షేత్రానికి చెడ్డపేరు వస్తుందని అంటున్నారు. స్థానికంగా ఉండే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తే లాడ్జీ యజమానుల్లో, సిబ్బందిలో భయం ఉంటుందని చెబుతున్నారు. వచ్చే భక్తులను నిషితంగా పరిశీలిస్తే ఏయే లాడ్జీలు భక్తులకు గదులు కేటాయిస్తున్నాయో ఏయే లాడ్జీలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నాయి అనే విషయాలు తెలుస్తాయి.

కేసులు నమోదు చేస్తాం..

బాసర లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం. ఆశ్రయం కల్పించే లాడ్జీ యజమానులపై చర్యలు తీసుకుంటాం. లాడ్జీల్లో ప్రైవేటు వ్యక్తులు జూదం, పేకాట ఆడినా, అలాంటివారికి గదులు కేటాయించినా కేసులు నమోదుచేస్తాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటాం.

– మల్లేశ్, ముథోల్ సీఐ

బండ భారం తగ్గింది!

- సిలిండర్ ధర రూ.100 తగ్గించిన కేంద్రం
- జిల్లాలో 2.47 లక్షల మంది వినియోగదారులకు లబ్ధి



భైంసాటౌన్: పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు తోడు మండుతున్న వంటగ్యాస్ ధరలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఒక సందర్భంలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.వెయ్యి దాటడంతో చాలావరకు పేద కుటుంబాల్లో గ్యాస్ వినియోగం తగ్గించారు. ప్రస్తుతం సిలిండర్ రూ.978.50 ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే అందిస్తోంది. దీనికి తోడు కేంద్రం మహిళా దినోత్సవ కానుకగా వంటగ్యాస్ వినియోగదారులకు ఊరటనిచ్చింది. సిలిండర్‌పై రూ.100 త గ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు కొంతమేర ఆర్థిక భారం తప్పనుంది. రాష్ట్ర ప్రభుత్వం గతనెల 27 నుంచి రూ. 500లకే సిలిండర్ అమలుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన రూ.100 తగ్గింపుతో రూ.400లకే సిలిండర్ అందిస్తుందా..లేదా.. అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ధర్‌పై నేరుగా రూ.100 తగ్గింపు ఇస్తారా.. సబ్సిడీలో జమచేస్తారా తేలాల్సి ఉంది. సిలిండర్ ధర తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది.

మంచి నిర్ణయం..

పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ భారంగా మారింది. వంటగ్యాస్ సిలిండర్‌కే రెండు నెలలకు రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి వస్తోంది. ప్రస్తుతం కేంద్రం రూ.100 తగ్గించడం మంచి నిర్ణయం. – సవిత, గృహిణి, భైంసా

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా...	
సాధారణ కనెక్షన్లు	1,39,430
దీపం సిలిండర్లు	47,215
ఉజ్వల కనెక్షన్లు	37,249
సీఎస్ఆర్ కనెక్షన్లు	22,828
మొత్తం కనెక్షన్లు	2,47,785

'పట్టా' గుట్టువీడేనా..?

- 'నకిలీ'లలు బయటపడేనా..?
- 'పునరావాసం' లేకున్నా పుట్టించారు
- పట్టణంలోనూ భూములు 'పట్టా'రు
- అసైన్డ్ ల్యాండ్‌లోనూ అవే కథలు
- జిల్లాలో ఇష్టారీతిన డీ-వన్ పట్టాలు
- 'ఏలేటి' ఆరోపణలతో మళ్లీ తెరపైకి..



అక్రమ డీ-వన్ పట్టాల పత్రాలను చూపుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని డీ-వన్ పట్టాల పేరిట ఆక్రమించేశారు. నిర్వాసితుల పేరిట ఫేక్ పట్టాలు పుట్టించారు. పునరావాస గ్రామాలకు పరిమితం కావాల్సిన వాటిని పట్టణాల్లో పెట్టారు. పైకి నేతలుగా చలామణి అయ్యే భూమేతలకు డీ-వన్ వరంగా మారింది. ఏళ్లుగా నలుగుతున్న ఈ భూమాయ.. మళ్లీ తెరపైకి వచ్చింది. ఎన్నికలకు ముందు అక్రమ డీ-వన్ పట్టాల అంతు తేలుస్తానంటూ హామీ ఇచ్చిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తాజాగా ఈ వ్యవహారాన్ని లేవనెత్తారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆయన విజిలెన్స్ ఎంక్వైరీకి డిమాండ్ చేస్తున్నారు. వీటితోపాటు పలు అసైన్డ్‌భూముల ఆక్రమణలు, చెరబట్టిన చెరువుల సంగతి తేల్చాలంటున్నారు. దీనిపై కలెక్టర్ సైతం సానుకూలంగా స్పందించి, విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

మునిగిన భూములు.. తేలిన పట్టాలు

గోదావరిపై పోచంపాడ్ వద్ద కట్టిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో ఎన్నో ఊళ్లు మునిగిపోయాయి. చేలు, పొలాలూ జలగర్భంలోకి వెళ్లిపోయాయి. అలా.. ముంపునకు గురైన ఊళ్లకు అప్పటి ప్రభుత్వం పునరావాసం కల్పించడంతోపాటు సాగుకు భూములనూ ఇచ్చింది. ఈక్రమంలో భూములు లేని పేదలు దరఖాస్తు పెట్టుకుంటే ఇచ్చే డీ-వన్ పట్టాలు తెరపైకి వచ్చాయి. ఇదే భూకబ్జారాయుళ్లకు వరంగా మారింది. ఈ పట్టాలను లెక్క ప్రకారం పునరావాస గ్రామాలుగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో, సదరు నిర్వాసితులకే కేటాయించాలి. కానీ.. జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ డీ-వన్ పట్టాలు ఉన్నాయి. పల్లెల్లో ఉండాల్సిన ఈ పట్టాలు పట్నంలోనూ భూములను పట్టుకున్నాయి. అసైన్డ్ చేసిన భూముల్లోకీ చొచ్చుకువచ్చాయి.

నకిలీవి పుట్టించి..!

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఇటీవల ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణల ప్రకారమే.. నిర్మల్ చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో 2014 నుంచి దాదాపు 350 పైచిలుకు డీ-వన్ పట్టాలు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో 200 పట్టాలు ఉన్నాయన్నారు. మొత్తం 3,439 ఎకరాల ప్రభుత్వ భూమిని డీ-వన్ పట్టాల పేరిట గత ప్రభుత్వంలో బడానాయకులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డీ-వన్ పట్టాల పేరిట తీసుకువచ్చిన వాటిలో సగానికి పైగా నకిలీవని తేలుతోంది. అసలు ఎస్సారెస్పీ నుంచి అధికారికంగా పదుల సంఖ్యలో మాత్రమే ఇచ్చినట్లుండగా, వందల సంఖ్యలో ఫేక్ డీ-వన్ పట్టాలు పుట్టించారన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వం హయాంలో అధికారపార్టీ నేతలు చేసిన భూమాయకు అప్పటి అధికారులూ సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపైనే బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విచారణ చేపట్టి భూముల ఆక్రమణల వెనకున్న బడానేతలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

'అసైన్డ్'నూ కమ్మేశారు..

భూమిలేని పేదలకు సాగుకోసం అసైన్డ్ చేసిన భూములనూ పెద్దలు చేజిక్కించుకున్నారు. ఇందులో సాదాసీదా పనికిరాని భూములు కాదు.. రూ.కోట్లు విలువ చేసే భూములున్నాయి. జిల్లా కేంద్రంలోనే అయ్యప్ప ఆలయం పరిధిలో విలువైన అసైన్డ్ భూములను చెరబట్టారు. ఏళ్లుగా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నా.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కనీసం సంబంధిత అధికారులనూ విచారణకు రానివ్వకుండా అడ్డుకున్న ఘటనలూ ఉన్నాయి. జిల్లాలో కేవలం డీ-వన్, అసైన్డ్ ఆక్రమణలతోనే ఆగిపోలేదు. దేవుడి మాన్యాలనూ కబ్జాపెట్టారు. చెరువుల శిఖాలను, ఎఫ్‌టీఎల్ భూములనూ ఆక్రమించేశారు. వీటన్నింటినీ తేల్చాలంటూ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విచారణ చేపట్టి భూఆక్రమణల కథ తేల్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ సైతం ఈ భూముల వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఇప్పటికైనా అక్రమ పట్టాల గుట్టు తేలుస్తారా..? ఆక్రమణలో ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటారా..? భూ ఆక్రమణలపర్వం కొలిక్కి వచ్చే దాకా 'ఏలేటి' పట్టువీడకుండా ఉంటారా..? అని జిల్లావాసులు చర్చించుకుంటున్నారు.

రైతుల కష్టం దళారులపాలు

- జిల్లాలో చేతికొస్తున్న మక్కలు
- ప్రారంభం కాని ప్రభుత్వ కొనుగోళ్లు
- రంగంలోని ప్రైవేటు వ్యాపారులు
- మద్దతుకన్నా రూ.100 తక్కువ



మక్కలను లారీలో ఎక్కిస్తున్న వ్యాపారులు

లోకేశ్వరం: ఆరుగాలం శ్రమించి మొక్కజొ న్న పండించిన రైతులు.. దిగుబడి అమ్ముకునేందు కు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేవు. ఒక వైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆశించిన దిగుబడి రాకపోగా, చేతికొచ్చిన పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ధర రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా మద్దతు ధరకన్నా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేయగా, ఈసారి మాత్రం మద్దతు ధర రూ.2,090కన్నా రూ.100 తగ్గించి కొంటున్నారు. మరోవైపు తరుగుపేరిట క్వింటాల్‌కు 2 కిలోలు కటింగ్ చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక తక్కువ ధరకే రైతులు అమ్ముకుంటున్నారు.

వారంలో రూ.100 తగ్గింపు..

కేంద్రం ఈ ఏడాది మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,090గా ప్రకటించింది. జిల్లాలో వ్యాపారులు, దళారులు మాత్రం రూ.2 వేలలోపే కొనుగోలు చేస్తున్నారు. గతేడాది మద్దతు ధర రూ.1,962 ఉంటే వ్యాపారులు రూ.2,200 వరకు చెల్లించారు. ఈసారి మాత్రం ధర తగ్గిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగంలోకి దళారులు..

జిల్లాలో ప్రస్తుతం మొక్కజొన్న దిగుబడి వస్తోంది. రైతులు నూర్పిడి చేసి ఆరబోస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా మక్కల రాశులే కనిపిస్తున్నాయి. దిగుబడి ఎక్కుగా ఉండడం, నిల్వకు గోదాంలు లేకపోవడంతో దళారులు రంగంలోకి దిగారు. ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వారం రోజుల్లో క్వింటాల్ రూ.100 తగ్గించి రూ.1,950 నుంచి రూ.2,050కి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మద్దతు ధరకన్నా ఎక్కువే చెల్లిస్తున్నారు.

క్వింటాల్‌కు 2 కిలోల తరుగు..

తూకం వేసేటప్పుడు వ్యాపారులు రైతుల నుంచి తరుగు పేరుతో క్వింటాల్‌కు 2 కిలోల వరకు మక్కలను అదనంగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు 2 కిలోల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

మొక్కజొన్న పంట ప్రస్తుతం కోతదశకు చేరుకుంది. కొనుగోలు కేంద్రాల విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ఆదేశాలు రాగానే కేంద్రాలు ప్రారంభించి పంట కొనుగోలు చేస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి

తక్కువ ధరకే..



మక్కలు చేతికి వస్తున్నయ్. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. పండించిన పంటలను ఇళ్లలో నిల్వ చేయలేక తక్కు వ ధరలకే వ్యాపారులకు అమ్ముకుంటున్నం. త్వరగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. – వినేష్, మొహళ

మద్దతు ధర కల్పించాలి



ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అమ్ముదామంటే అందుబాటులో కొనుగోలు కేంద్రాలు లేవు. గిట్టుబాటు ధర లేక చేనులోనే అరబెడుతున్నాం. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. – చంద్రశేఖర్‌రెడ్డి, రాయపూర్‌కాండ్లీ

అన్నిరంగాల్లో అతివల రాణింపు



ఉత్తమ సేవలందించిన మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో అన్నిరకాల నైపుణ్యాలకు చెందిన ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అతివలు అత్యుత్తమ ప్రతిభతో రాణిస్తున్నారని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు ఏ.రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు కే.దేవీప్రియ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ ఉత్తమ సేవ అందించిన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారి శ్రీదేవి, జిల్లా అసోసియేట్ బాధ్యులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలపై ఆగ్రహం

- ఖండించిన టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- నిర్మల్‌లో టీయూటీఎఫ్ జిల్లా సభలు



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ ఉద్యోగులపై మాజీమంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీయూటీఎఫ్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా మహాసభల్లో మాట్లాడారు. రాష్ట్ర సంక్షేమంలో నిరంతరం పాలుపంచుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఇష్టారీతిన మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఉపాధ్యాయుల టెట్ సమస్యను పరిష్కరించాలని, టెట్ నోటిఫికేషన్ ఇస్తూ ఉపాధ్యాయ టెట్ లేకుండా పదోన్నతులు ఇవ్వాలని, ఆగిన పదోన్నతులు బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పండిత, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేసినా గత ప్ర భుత్వ నిర్లక్ష్యంతో ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని తెలిపారు. వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని, పటిష్టవంతమైన హెల్త్ స్కీం అమలు చేయాలని సూచించారు. ఎయిడెడ్, మోడల్ స్కూల్, గురుకుల, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులకు కూడా ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని కోరా రు. 40 శాతం ఫిట్‌మెంట్‌తో ఆరు నెలల్లో కొత్త పీఆ ర్సీ ప్రకటించాలన్నారు. 317 జీవోతో నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు మురళి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, రాష్ట్ర నాయకులు తోట గంగాధర్ జిల్లా కోశాధికారి పోల ధర్మరాజ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ముస్కు పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు వై.వెంకటరమణారెడ్డి, ప్రేమ్‌సాగర్, శివరాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న ఉద్యోగ మేళా

ఇచ్చోడ: ఈ నెల 13న ఉట్నూర్‌లో గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జేఆర్పీ ముకుంద్ తెలిపారు. ఉదయం 11గంటలకు ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆధ్వర్యంలో మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు విద్యార్హత, కుల ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైనా ఉద్యోగం చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఈ ఉద్యోగ మేళాకు హైదరాబాద్‌లోని 15 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై వెయ్యి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో నాగేంద్రుడి దర్శనం



ఆలయ గర్భగుడిలో నాగుపాము

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గొండు గూడాలోని రాజరాజేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం అర్ధరాత్రి నిర్వహించారు. మరోవైపు భక్తులు జాగరణ, భజన చేస్తుండగా లింగోద్భవ సమయంలో ఆలయ గర్భగుడిలో నాగుపాము దర్శనమిచ్చింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

లింగాపూర్‌లో దొంగతనం



గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చేపూరి నవ్య ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మహాశివరాత్రి సందర్భంగా నవ్య పక్కనే ఉన్న అత్తమ్మ రూంలో పడుకుంది. తెల్లవారి చూసేసరికి ఇంటి, బీరువా తాళం పగులగొట్టి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. శనివారం సంఘటన స్థలాన్ని ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ధ్వంసం

సిరికొండ: మండల కేంద్రంలో ఇంటి ఎదుట ఉంచిన బైక్‌ను దుండగులు ధ్వంసం చేశారు. మండల కేంద్రానికి చెందిన దోండే కాశీనాథ్‌కు చెందిన బైక్‌ను తన నివాసం ఎదుట ఉంచగా గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇనుపరాడ్‌తో దాడిచేసి బైక్‌ను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

ఇక చదవాల్సిందే..

- గ్రూప్స్ ఉద్యోగ పరీక్షలకు తేదీలను ఖరారు చేసిన టీఎస్‌పీఎస్సీ
- జిల్లా కేంద్రాల్లోని స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణకు ప్రభుత్వం ఏర్పాటు
- ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఉద్యోగం పొందే అవకాశం
- ఉత్తమ ప్రణాళికే విజయానికి సోపానం



బోథ్: గ్రూప్- 1, గ్రూప్- 2, గ్రూప్- 3 ఉద్యోగాల పరీక్షల తేదీలను టీఎస్‌పీఎస్సీ ఇటీవలే ప్రకటించింది. గ్రూప్- 1 ఈ ఏడాది జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21న మెయిన్స్, ఇక గ్రూప్- 2ను ఆగస్టు 7, 8వ తేదీల్లో, గ్రూప్- 3 నవంబర్ 17,18 తేదీల్లో నిర్వహించనున్నారు. దీంతో నిరుద్యోగులు ఉద్యోగ ప్రిపరేషన్‌లో నిమగ్నమయ్యారు. సమయాన్ని వృథా చేయకుండా, ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే నిరుద్యోగులకు కోచింగ్ ఇవ్వడానికి జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేస్తోంది.

అత్యుత్తమ ప్రణాళిక ఉండాలి..

చాలా మంది నిరుద్యోగులు గ్రూప్స్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనర్చి ఉద్యోగం సాధించాలనే ప్రణాళికబద్ధంగా చదవాల్సిన అవసరం ఉంది. నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక సర్వశక్తులూ కూడగట్టాల్సిన సమయం. సమస్యలు పక్కనపెట్టి, పరిమితులు దాటుకుని, బలహీనతలను అధిగమించాల్సిన అవసరం ఉంది. తమ లక్ష్యాన్ని ఎక్కుపెట్టి ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు చదవాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్ని గంటలు చదవడానికి వెచ్చించాలి.. ఎంత సాధన చేయాలి.. ఎన్ని గంటలు ప్రయత్నం చేయడానికి ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలి. ప్రతి సబ్జెక్టు కూ టైమ్ టేబుల్ రూపొందించుకున్నట్లే పునశ్చరణ కోసం ప్రాధాన్యతనివ్వాలి. ఇక ఏకాగ్రత కోసం ప్రయత్నించాల్సి అవసరం ఉంది. ఏకాగ్రత సన్నిగిల్లకుండా చూసుకోవడానికి కొంత ధాన్యం చేయాల్సిన అవసరంర ఉంది.

వ్యసనాలు వీడాలి..

ప్రస్తుతం ఫోన్ ప్రతి ఒక్కరికి వ్యసనంగా మారింది. ఫోన్ చేతిలో లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితి. ఇక వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాం వంటి సోషల్ మీడియాను దూరం పెట్టడం మంచింది. అవసరమైతే తప్ప ఫోన్‌ను ఉపయోగించకుండా ఉంటే చదవడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం చాలా మంచిది. ఇక ఇతర వ్యవనాలు ఉంటే పూర్తిగా పక్కన పెట్టడం ద్వారా ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకృతం చేయవచ్చు. ఇక ప్రతి విషయంపై నెగెటివ్‌గా ఫీల్ కాకుండా పాజిటివ్‌గా ఉండే ప్రయత్నం చేయాలి.

వర్తమాన అంశాలపై దృష్టిపెట్టాలి



ప్రణాళికబద్ధంగా చదవాలి. సాధ్యమైనంతవరకు గత ప్రశ్నాపత్రంలోని ప్రశ్నల సరళిని గమనిస్తూ ప్రిపరేషన్‌ను కొనసాగించాలి. చదవడానికి సాధ్యమైనంత వరకు తగిన సమయాన్ని కేటాయించాలి. ముఖ్యంగా వర్తమాన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రతి రోజు దిన పత్రికలను చదవుతూ ఉండాలి. పత్రికలోలని ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. కఠినమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– గొడిసెల రమణగౌడ్, సీనియర్ జీకే, కరెంట్ అఫైర్స్ ఫ్యాకల్టీ

ప్రత్యేక దృష్టి సారించాలి



సబ్జెక్టుల వారీగా ఎక్కువగా రివిజన్ చేయాలి. మాక్ టెస్టులను వీలైనంత ఎక్కువగా రాయాలి. సమకాలీన, వర్తమానంశాలను సబ్జెక్టులతో అనుసంధానం చేస్తూ చదవాలి. సమయం వృథా చేయవద్దు. ఏకాగ్రత దెబ్బతినకుండా చూసకోవాలి. పాజిటివ్‌గా ఆలోచించాలి. ఒత్తిడికి లోనుకావద్దు. ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా చదవాలి.

– అల్లం సాయికృష్ణ, ఫిజికల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సూర్యపూర్‌లో అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

- మహారాష్ట్ర వాసులదే పైచేయి



తలపడుతున్న మల్లయోధులు

కుంటాల: మండలంలోని సూర్యపూర్ శ్రీరాజరాజేశ్వర ఆలయ ఆవరణలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు పాల్గొని పోటీల్లో తలపడ్డారు. ఇందులో మహారాష్ట్ర వాసులు విజయం సాధించారు. సూర్యపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో మొత్తం 182 కుస్తీపోటీలు నిర్వహించగా ఇందులో సుమారు 400 మంది మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. చివరి కుస్తీ పోటీలో నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలోని డెగ్లూర్‌కు చెందిన కిరణ్, నాందేడ్ జిల్లా బోకర్ తాలూకాలోని బిద్రాలికి చెందిన సాయినాథ్ తలపడ్డారు. ప్రథమ విజేతగా సాయినాథ్ నిలువగా రూ.6,100 నగదుతో పాటు వెండి కడియం, రెండో విజేతగా నిలిచిన కిరణ్‌కు రూ.3వేల నగదు శాలువాతో గ్రామస్తులు సన్మానించారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జాదవ్ రాజేష్ బాబు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భైంసాలో యువకుడి హత్య



సయ్యద్ సోహెల్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ ప్రాంతంలో సయ్యద్ సోహెల్(24) హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓవైసీనగర్‌కు చెందిన సోహెల్ శనివారం సాయంత్రం వస్తుండగా సాయి కాటన్ ప్రాంతంలో అదే సామాజిక వర్గానికి చెందిన మరో యువకుడు అతడిని అడ్డగించి స్క్రూడ్రైవ్ లాంటి పదునైన ఆయుధంతో దాడి చేశాడు. దీంతో ఛాతి, ముఖం, నడుం వద్ద తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పట్టణంలోని ఏరియాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ రాజారెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్ వద్ద శనివారం మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కళ్యాణ్ తెలిపారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎండీ సాహిద్, మరో బాలుడు తమ సెల్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ మట్కా ఆడుతూ పట్టుబడినట్లు ఎస్సై పే ర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫో న్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ట్లు వివరించారు. మట్కా జూదం ఆడితే కఠి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై రాజు

లోకేశ్వరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం... మండలంలోని హవర్గ గ్రామ శివారులో ప్రాంతంలోని సుద్ద వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా



గుడిపేట వద్ద బోల్తా పడిన వ్యాన్



పండ్లు తీసుకెళ్తున్న స్థానికులు

- పండ్లకోసం ఎగబడిన జనాలు
- నిమిషాల్లోనే వ్యాన్ మొత్తం ఖాళీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అదుపుతప్పి పండ్ల వ్యాన్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని యావత్‌మాల్‌లో శనివారం వ్యాన్‌లో బత్తాయి పండ్లు లోడ్ చేసుకుని మంచిర్యాల మార్కెట్‌కు బయలుదేరింది. హాజీపూర్ మండలం గుడిపేటలోని దుబ్బపల్లి జాతీయ రహదారి వరకు రావడంతో దుబ్బపల్లికి చెందిన ముడుగుల వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటే క్రమంలో పండ్ల వ్యాన్ రావడాన్ని గమనించి ఒక్కసారిగా బైక్ ఆపేశాడు. ఒక్క సారిగా ఆందోళనకు గురైన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వ్యాన్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. గమనించిన స్థానికులు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు సైతం 'సందెట్లో సడేమియా'గా బత్తాయి పండ్లను పది నిమిషాల్లోనే ఖాళీ చేశారు. సదరు పండ్ల వ్యాపారికి దాదాపు రూ.లక్షకు పైగానే నష్టం వాటిల్లి ఉంటుందని పలువురు గుసగుసలాడుకోవడం కొసమెరుపు.

అర్బన్‌పార్క్‌లో మంటలు



వ్యాపించిన మంటలు

నేరడిగొండ: బోథ్ ఎక్స్‌రోడ్ వద్ద గల అర్బన్‌పార్క్‌లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులతో పాటు సిబ్బంది, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రాత్రి కావడంతో ఇచ్చోడ నుంచి వచ్చిన అగ్నిమాపక శకటం ద్వారా మంటలను ఆర్పివేశారు. ఎంత నష్టం వాటిల్లిందో తెలియరాలేదు. ఆదివారం తెలియజేసే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఏదేమైనా ఇది ఆకతాయిల పనే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మద్యం దొంగల అరెస్ట్

- సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు అరెస్ట్, పరారీలో మరో నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఫణీందర్

తాంసి: మండల కేంద్రంలోని వైన్స్‌షాప్‌లో మద్యం చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా 48గంటల్లో పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ ఫణీందర్ నిందితుల వివరాలను శనివారం వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన మండల కేంద్రంలోని మాధవి వైన్స్ షాపుపైన రేకులను తొలగించి మద్యం ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం వైన్స్‌షాప్‌ను తెరచిన సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకోగా నిజం ఒప్పుకున్నారు. మండల కేంద్రానికి చెందిన గుగ్గిల పోశెట్టి, షేక్ సోహెల్, గుండగాని మహేందర్, సెడ్మాకి శ్రీకాంత్ నలుగురు వైన్స్‌షాప్‌లో దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించారు. వీరిలో పోశెట్టి, షేక్ సోహెల్, మహేందర్‌ను అరెస్ట్ చేయగా శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు గత నెల 22, 24, 27వ తేదీలతో పాటు ఈ నెల 2వ తేదీన సైతం దొంగతనానికి పాల్పడినట్లు సీసీటీవీలో గుర్తించారు. అయితే పోశెట్టి మండల కేంద్రంలోనే బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో నిత్యం మాధవి వైన్స్‌లో నుంచి మద్యం తీసుకెళ్లేవాడు. అందులోనే దొంగతనం చేసేందుకు పక్కాగా ప్లాన్ చేసి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వరుసగా వైన్స్‌షాప్ పైన రేకులను తొలగిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు. మొత్తం రూ.2లక్షల విలువైన మద్యం దొంగలించి విక్రయించినట్లు గుర్తించారు. దాచిపెట్టిన మద్యం పాటు నగదు సీజ్ చేశారు. ఇందులో తలమడుగు ఎస్సై ధనశ్రీ, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, కానిస్టేబుల్ చిరంజీవి, రమణ ఉన్నారు.

ప్రజల ఆశలు ఆవిరి చేసిన మోదీ

- ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం నేర్పాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఎదులాపురం: జిల్లా ప్రజల ఆశలను భారత ప్రధాని మోడీ ఆవిరి చేశారని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి తగు గుణపాఠం నేర్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మోడీ స్థానిక దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుతారని జిల్లావాసులు ఎంతో ఆశగా ఎదురు చూశారని అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సీసీఐ తెరిపిస్తామని, ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్, గిరిజన యూనివర్సిటీ, జిల్లా కేంద్రంలో విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వారి హామీల మేరకు జిల్లా ప్రజలు ఎంపీగా గెలిపించడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఈ మారు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి 4 ఎమ్మెల్యేలుగా గెలిపించడం జరిగిందన్నారు. ప్రధాని మోడీ జిల్లా సమస్యల పరిష్కారం దిశగా హామీ వర్షం కురిపిస్తారని ఎదురు చూసిన జిల్లా ప్రజలకు ఆయన మొండి చేయి చూపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంకా రాఘవలు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న మంజుల పాల్గొన్నారు.

నేరస్తుడిని పట్టించిన సీసీ కెమెరా

- రాచాపూర్‌లో నెలరోజుల వ్యవధిలో నాలుగు బైకులు దగ్ధం
- పాత పగతో నిందితుడి ఘాతుకం
- యువకుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద: వరుసగా బైక్‌ల దగ్ధం కేసులో సీసీ కెమెరాలు నిందితుడిని పట్టించాయి. తన అన్నకు గ్రామస్తులకు మధ్య జరిగిన పాత గొడవలు మనసులో పెట్టుకొని గ్రామంలో నలుగురు వ్యక్తులకు సంబంధించిన బైకులను తగలబెట్టిన మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన యువకుడు పట్టుబడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన భూషి సాయికుమార్ అనే యువకుడు నెలరోజుల వ్యవధిలో తన అన్నతో గొడవ పెట్టుకున్న వ్యక్తుల కదలికలు గమనించాడు. నెలరోజుల క్రితం అర్ధరాత్రి గ్రామంలో అందరూ గాఢనిద్రలో ఉండగా అదే గ్రామానికి చెందిన దాసరి అశోక్ బైకును పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తర్వాత వారం వ్యవధిలో అదే గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్, రాందేని మహేష్‌ల పల్సర్ బైకులను తగలపెట్టాడు. శుక్రవారం అర్ధరాత్రి 2:30 గంటలకు అదే గ్రామానికి చెందిన ఈర్ల ముత్యం బైక్‌కు నిప్పంటించి పారిపోగా బాధితుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న కెమెరాలో, మరో వ్యక్తి ఇంటి వద్ద సీసీకెమెరాలో రికార్డు అయింది. దీంతో పోలీసులు నిందితుడిని గుర్తించి సోన్ సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి దగ్గర నుంచి పెట్రోల్ బాటిల్, నేరం చేసిన సమయంలో ధరించిన దుస్తువులు, అగ్గిపెట్టె స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం న్యాయస్థానంలో హాజరుపరిచగా 10రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కృషి చేసిన సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లు కిరణ్, భీమేష్, సాయి, సునీల్‌లను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

'రణ స్వరం' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న కవి శివారెడ్డి




నారాయణను సన్మానిస్తున్న కవయిత్రి సులోచన

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన కవి బొల్లారం బాబన్న రాసిన రణ స్వరం అనే కవితా సంపుటిని ప్రసిద్ధ కవి కె.శివారెడ్డి శనివారం హైదరాబాద్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలో కలిగే భావాలను ఎదుటి వాళ్లకు చెప్పడమే కవిత్వమన్నారు. మరెన్నో కవితా సంపుటాలు రచించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు, రూప్‌కుమార్ డబ్బీకర్, వాసిరెడ్డి నవీన్, ఉదారి నారాయణ, ఎంపెల్లి లక్ష్మీనారాయణ, గంగన్న, త్రివేణి, ఇందిర పాల్గొన్నారు.

జిల్లా కవికి పుస్తకం అంకితం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణకు కవయిత్రి గడ్డం సులోచన రచించిన సులోచనానీలు అనే పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ప్రసిద్ధ కవి ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరించారు. కవయిత్రి సులోచన కవి ఉదారి నారాయణ క్లాస్మేట్స్ కావడం గమనార్హం. కవి నారాయణపై ఉన్న అభిమానంతో పుస్తకాన్ని ఆయనకు అంకితం ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆదినారాయణ, వంశీధర్, లక్ష్మీనారాయణ, కవులు బాబన్న, గంగన్న, ఇందిర, దేవేందర్, త్రివేణి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

'అడెల్లి'లో నిజామాబాద్ మేయర్ పూజలు



పూజలో పాల్గొన్న నీతూ కిరణ్

నిర్మల్: జిల్లాలోని సారంగపూర్ మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని నిజామాబాద్ నగరపాలక సంస్థ మేయర్ నీతూ కిరణ్ శనివారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. బాలాలయంలో మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జైనూర్: ఈ నెల 2న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పారా గ్రామానికి చెందిన కినక బాపురావు (35) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నెల 2న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.